

నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

బిసిల సంక్షేమాభివృద్ధికి సహకారం

-ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బిసి సంక్షేమం, అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం బిసి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బోడెం రాజశేఖర్ ఆధ్వర్యంలో బిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్, విజయభారతి హైస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు, జనసేన నాయకులు జంగాల శివరాం రాయల్, చేనేత విభాగం నాయకులు పురం సహదేవ, నాగినేని గోవిందు, సి.రామలింగయ్య, రామకృష్ణ, బత్తుల లక్ష్మీపతి, మేస్త్రి శ్రీనివాసులు, మహమ్మద్ అలీ, ఈశ్వరమ్మ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బిసిల అన్ని రంగాల్లో రాణిస్తున్నారని వారికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బీసీలకు మంత్రిమండలిలో స్థానం కల్పించడంతో పాటు ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుత రాజకీయల్లో బీసీలు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. అర్హులైన బిసి లందరికీ ఇంటి పట్టాలు, సంక్షేమ పథకాలు అందించడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సీట్లు కేటాయిస్తామన్నారు. బిసిల ఐక్యతకు బోడెం రాజశేఖర్ కృషిని ప్రశంసించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ బీసీలను కలిసికట్టుగా ముందుకు నడిపించడంలో బోడెం రాజశేఖర్ సఫలీకృతులయ్యారన్నారు. బిసిలంతా ఏకతాటిపై నడిచి రాజ్యాధికారం సాకారం చేసుకోవాలన్నారు. బిసిల హక్కుల సాధనకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతునిస్తుందన్నారు. విజయభారతి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు మాట్లాడుతూ బిసిల ఐక్యతే వారి అభ్యున్నతికి బాటలు వేస్తుందన్నారు. బిసి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకులు రాజశేఖర్ మాట్లా డుతూ బిసి ఆత్మీయ సమావేశానికి విచ్చేసిన ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు, కుల బాంధవులకు కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో బిసిల శ్రేయస్సు కొరకు నిర్విరామ కృషి చేస్తామని స్పష్టం చేశారు. అంతకు ముందు బిసి నాయకులతో కలిసి మదనపల్లె టమోటా మార్కెట్ యార్డ్ నుంచి శ్రీకృష్ణ కల్యాణ మండపం వరకు పాదయాత్ర నిర్వహించారు.



బిసి నాయకులతో కలిసి సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి సినీ గేయ పోటీలు

గెలుపొందిన విజేతలకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు ప్రదానం



అతిథులకు జ్ఞాపికలు అందజేస్తున్న కళాంజలి అప్పారావు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తెలుగు ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న ప్రముఖ సినీ గాయకులు బాలసుబ్రమణ్యం 79వ జయంతి వేడుకలు సందర్భంగా ఆదివారం పట్టణ కేంద్రంలోని వైష్ణవి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో కళాంజలి సాంస్కృతిక కళా పీఠం అధ్యక్షులు కళాంజలి, విజయకల్యాణ్ ఆధ్వర్యంలో అట్టహాసంగా రాష్ట్రస్థాయి సాంస్కృతిక, సినీ గేయ పాటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా న్యాయవాది కాశీ విశ్వనాథ్, రాజంపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు బచ్చోటి భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ సినీ గాయకులు, తన పాటల ద్వారా తెలుగు ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న గాన గాంధర్వుడు బాలసుబ్రమణ్యం, ఘంటసాల జ్ఞాపకార్థం రాజంపేటలో కళాంజలి సాంస్కృతిక కళా పీఠం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పాటల పోటీలను నిర్వహించడం హర్షణీయమన్నారు. ఈ పోటీలలో పాల్గొనేందుకు చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ఉత్సాహంగా పాల్గొని వారి ప్రతిభను కనబరిచారన్నారు. నేటి ఆధునిక యుగంలో ఇలాంటి సాంస్కృతిక, సినీ గేయ పోటీలు నిర్వహించడం వల్ల సృజనాత్మక శక్తిని వెలికి తీయవచ్చునన్నారు. అనంతరం కళాంజలి సాంస్కృతిక కళా పీఠం అధ్యక్షులు కళాంజలి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాజంపేటలో ప్రముఖ సినీ గాయకులైన ఘంటసాల, బాలసుబ్రమణ్యం జ్ఞాపకార్థం పాటల పోటీలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ ఏడాది కూడా రాజంపేటలో అత్యంత వైభవంగా సాంస్కృతిక, సినీ గేయ పోటీలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగానే వారి జ్ఞాపకార్థం గాన గాంధర్వుడు అవార్డును, ఎస్పీ బాలసుబ్రమణ్యం స్మారక స్వరార్చన అవార్డులను చెన్నై కి వెళ్లి స్వర్గీయ బాలసుబ్రమణ్యం తనయుడు ఎస్పిచరణ్, ప్రముఖ గాయకురాలు సుశీలకు అందజేస్తామన్నారు. అనంతరం పాటల పోటీలలో గెలుపొందిన విజేతలకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. రానున్న రోజుల్లో రాజంపేట పట్టణ కేంద్రంలో ఎస్పీ బాలసుబ్రమణ్యం, ఘంటసాల విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు ఆకాశవాణి కళాకారుల సంగీత విద్వాంసులు గుణకళ సుబ్బరాయుడు, నవోదయ సంగీత స్కూల్ విద్వాంసుడు వెంకటాద్రి, నిర్వాహకులు సత్యవతి దేవి, ఎస్.రాధిక వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ, గాయకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో అహం దూరం

-మానవత వ్యవస్థాపకులు ఎన్.రామచంద్రారెడ్డి



ప్రమాణ స్వీకారం చేస్తున్న మానవత సభ్యులు



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-రాయచోటి

సేవా కార్యక్రమాల ద్వారానే అహంకారం దూరమవుతుందని, ఇంటికొకరు మానవత అనే నినాదంతో సమాజాన్ని కదిలించే శక్తిగా మానవతా సంస్థ ముందుకెళుతుందని మానవత వ్యవస్థాపకులు ఎన్.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చిత్తూరు రోడ్డులో గల ఎస్ఆర్ కళ్యాణ మండపంలో ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు బ్రహ్మానంద రెడ్డి, రాయచోటి అధ్యక్షులుగా అంకం జయచంద్రారెడ్డి ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమం రాయచోటి మానవత చైర్మన్ అరమాటి శివగంగి రెడ్డి, పూర్వపు అధ్యక్షులు గాండ్లపెంట ఖాదర్‌బాషా, కన్వీనర్ చింతంరెడ్డి వెంకట్రామి రెడ్డి అధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామచంద్ర రెడ్డి, కేంద్ర కమిటి సభ్యులు నిమ్మనపల్లి సహదేవరెడ్డి, అవటాల రామంజులురెడ్డి, జిల్లా విద్యాకమిటి సభ్యులు రాటాల గోపీ, రాయచోటి శాఖ గౌరవ అధ్యక్షుడు బెల్లం లోకనాథ రెడ్డి హాజరయ్యారు. 2025-26 ఉమ్మడి కడప జిల్లా, రాయచోటి మండల కమిటి నూతన కార్యవర్గ జిల్లా సెక్రెటరి రామానాయుడు, కోశాధికారి హరికుమార్ , ఉపాధ్యక్షులు అల్లం రెడ్డప్పరెడ్డి, సంయుక్త కార్యదర్శి కావలి కృష్ణతేజ, ఇసి చైతన్య చవ్వా కృష్ణారెడ్డి, ఇసి విద్య డి.రామిరెడ్డి, ఇసి ఆరోగ్య కల్లూరు గంగాధర రెడ్డి, ఇసి అత్యవసర పాలకొండ రాయుడు, రాయచోటి కమిటి కార్యదర్శి బుక్కే నాగేశ్వర నాయక్, కోశాధికారి టేకురి నాగార్జున, ఉపాధ్యక్షులు పురం మురళి మోహన్ సంయుక్త కార్యదర్శి సాధు బసిరెడ్డి, ఇసి, చైతన్య కేతంరెడ్డి హరినాథ రెడ్డి, ఈసీ విద్య మూడే రంజిత్ నాయక్, ఇసి ఆరోగ్య దుర్గం సబ్బిర్, ఇసి అత్యవసర మేకల శివారెడ్డి సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు.

ప్రజాశక్తి కడప అర్బన్ : మానవతా కడప నగర నూతన శాఖ ఆవిర్భవించింది. స్థానిక నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఆవరణంలో ఆదివారం ఎన్నిక చేశారు. మానవతా వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి ఈ సందర్భంగా ఉపనిషత్తుల సారాంశాన్ని సభికులకు వివరించారు. ప్రతి ఇంటిలో ఒక మానవతా సభ్యుడు ఉండాలని చెప్పారు. దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమం ముమ్మరం కావాలని ఆకాంక్షించారు. మనిషి తాను ఎలా ప్రవర్తిస్తున్నాడో ఎప్పటికప్పుడూ గమనంలో ఉండాలని కోరారు. సమాజంపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా నూతన నగర కమిటీతో రామచంద్రారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. నగర కమిటీ అధ్యక్షులుగా ప్రొఫెసర్ గడ్డం సాంబశివారెడ్డి, కార్యదర్శి అవ్వారు సుబ్బయ్య, కోశాధికారిగా ఆడిటర్ కాంబోజి గంగా శివ సాయి తేజ, ఉపాధ్యక్షులు రిటైర్డ్ టీచర్ బొడిచెర్ల వెంకట సుబ్బరాయుడు, సంయుక్త కార్యదర్శి సమ్మెట సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు అవగాహన విభాగం సాన వెంకట సుబ్బన్న, విద్యా విభాగం కల్లూరు బాల ఎల్లారెడ్డి, ఆరోగ్య విభాగం పలవలి ప్రతాపరెడ్డి, అత్యవసర విభాగం కందుల వెంకటసుబ్బారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ కడప నగరంలో మానవతా సేవలు మరింత విస్తరింప చేస్తామన్నారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు రాటాల గోపి, అవటాల రామాంజనేయరెడ్డి, ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యం, సభ్యులు భూపతి రాయల్, శివ విష్ణుమోహన్ రెడ్డి, నాగార్జున కళాశాల వ్యవస్థాపకులు బైరెడ్డి రామకృష్ణారెడ్డి, పప్పనబోయిన సుబ్బరాయుడు, పోతుల వెంకట్రామిరెడ్డి, లయన్ చిన్నపరెడ్డి, సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పీలేరు : సామాజిక సేవాభావం ప్రతి ఒక్కరిలో అలవాడాలని పీలేరు మానవత సేవా సంస్థ చైర్మన్ వంగిమళ్ళ రామచంద్ర తెలిపారు. ఆదివారం పీలేరులో మానవత సంస్థ నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మానవత ప్రతినిధులు సంస్థ సభ్యులతో మాట్లాడుతూ పీలేరు మండల స్థాయిలో 2024-25 విద్యా సంవత్సరానికి జరిగిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుతులు అందజేయాలని, సంస్థలో కొత్తవారికి అవకాశం కల్పిస్తూ నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టి సంస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జులై 1న ప్రారంభించి నెలాఖరుకు పూర్తి చేయాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో అత్యధిక విద్యార్థుల నమోదు చేసిన పాఠశాలలను అభినందించే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సంస్థ ద్వారా ఇదివరకు చేసిన వినూత్న కార్యక్రమాలపై సమీక్షించడం, ఇదే ఒరవడిని ఇక భవిష్యత్తులోనూ కొనసాగించాలని, కార్యక్రమాల నిర్వహణకు అవసరమయ్యే ఆర్థిక వనరుల సమీకరణ విషతలపై చర్చించడం జరిగిందన్నారు. కార్యక్రమానికి చైర్మన్ వి.రామచంద్ర, కో-చైర్మన్ కృష్ణమూర్తి, అధ్యక్షులు శెట్టి సుబ్రహ్మణ్యం, సభ్యులు జివి రమణ, పెంజూరి అశోక్, హరికుమార్, అక్రమ్‌బాషా, నాగరాజ, పోతంశెట్టి రమేష్, రెడ్డప్ప, సిద్ధప్ప, ఖలీల్ బాష, సుధాకర్ బాబు, ఆంజనేయులు శెట్టి పాల్గొన్నారు.

చైతన్య సంస్థ సేవలు స్ఫూర్తి దాయకం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు స్ఫూర్తి దాయకమని మదనపల్లె వెరిటాస్ ఫైనాన్స్ లిమిటెడ్ బృందం సభ్యులు పేర్కొన్నారు. వెరిటాస్ ఫైనాన్స్ లిమిటెడ్ క్లస్టర్ హెచ్‌డి భాస్కర్ కుమార్తె తేజస్విని పుట్టిన రోజును పురస్కరించుకొని ఆదివారం చైతన్య సంస్థలోని చిన్నారులకు, వృద్ధులకు పోషక విలువలతో కూడిన అన్న వితరణ చేశారు. రు.వెరిటాస్ ఏరియా మేనేజర్ మస్తాన్ బృందం సంస్థలో ఐదు, ఆరు, ఏడు తరగ తులు చదువుతున్న చిన్నారులకు రూ.14 వేలు విలువగల పాఠ్యపుస్తకాలు అందించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ఇద్దరు బాలికలకు రూ.2,400విలువ చేసే యూనిఫామ్స్ అందజేశారు. సంస్థ వ్యవ స్థాపక అధ్యక్షులు ఎంపీ ఆనందన్, జనరల్ సెక్రటరీ కవితారాణ, వెరిటాస్ ఫైనాన్స్ లిమిటెడ్ క్లస్టర్ హెచ్.డి భాస్కర్, ఏరియా మేనేజర్ మస్తాన్‌ను శాలువాతో సత్కరించి సంస్థ జ్ఞాపికను అందించారు. కార్య క్రమంలో చిన్నారులు, వృద్ధులు, సిబ్బంది, వెరిటాస్ ఫైనాన్స్ బృందం పాల్గొన్నారు.



పాఠ్యపుస్తకాలతో చైతన్య సంస్థ చిన్నారులు

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

జిల్లా ప్రజా రవాణా అధికారి రాము



ముఖా ముఖి..

ప్రజాశక్తి - రాయచోటి

ఆర్‌టిసి ప్రయాణమే సురక్షితమని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని జిల్లా ప్రజా రవాణా అధికారి పి.రాము పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో ప్రయాణకులకు అందరికి అందుబాటులో ఉండి జిల్లాలో ఆర్‌టిసి డిపో వివరాలు, ఆదాయం ఎలా పొందాలో, నూతన బస్సులు ఏర్పాటు, ప్రయాణకులకు సురక్షిత మైన ప్రయాణం ఎలా కల్పించాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాలో డిపోలు, బస్సులు ఎన్ని ఉన్నాయి?

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 5 డిపోలున్నాయి. మదనపల్లి-1, మదనపల్లి-2, పీలేరు, రాజంపేట, రాయచోటిలలో డిపోలున్నాయి. జిల్లాలో మొత్తం 494 బస్సులు ఉన్నాయి. ఇందులో మదనపల్లి -1లో ఆర్‌టిసి 87,హైర్ బస్సులు 26, మొత్తం 113, మదనపల్లె - 2లో ఆర్‌టిసి 69, హైర్ బస్సులు 15, మొత్తం 84 బస్సులు ఉన్నాయి. పీలేరులో అర్‌టిసి 66,హైర్ బస్సులు 24, మొత్తం 90, రాజంపేటలో ఆర్‌టిసి 48,హైర్ బస్సులు 31, మొత్తం 79, రాయచోటి డిపోలో ఆర్‌టిసి 87, హైర్ బస్సులు 41, జిల్లా వ్యాప్తంగా మొత్తం 128 బస్సులు ఉన్నాయి.

జిల్లాకు కొత్త బస్సులు ఏమైనా వచ్చాయా ?

అన్నమయ్య జిల్లాకు కొత్తగా 37 బస్సులు వచ్చాయి. ఆర్‌టిసి 15,హైర్ బస్సులు 22 వచ్చాయి. ఇందులో మదనపల్లి-1లో 7,హైర్ బస్సులు 5 మొత్తం 12, పీలేరు డిపోలో ఆర్‌టిసి 1,హైర్ బస్సులు 7, మొత్తం 8, రాజంపేటలో హైర్ బస్సులు నాలుగు వచ్చాయి. , రాయచోటిలో ఆర్‌టిసి 4, హైర్ బస్సులు 4, మొత్తం 8 బస్సులు వచ్చాయి.

జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు బస్సులు ఏమైనా ఏర్పాటు చేశారా?

అన్నమయ్య జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు మొత్తం 18 సర్వీసులు నడుపబడుచు న్నవి. బెంగళూరు 9, చెన్నై 3, బళ్లారి 2, హైదరాబాద్ 4, సర్వీస్‌లు నడుపుతున్నాం.ఇందులో మదనపల్లి 1 నుంచి బెంగళూరు కి 3, హైదరాబాద్ కి 4, బళ్లారి 1 మొత్తం 8, మదనపల్లి - 2 నుంచి చెన్నై కి 1, పీలేరు నుంచి బెంగళూరుకి 3, చెన్నైకి 1, మొత్తం 4, రాజంపేట నుంచి బెంగళూరుకి 2, రాయచోటి నుంచి బెంగళూరుకు 1, చెన్నైకి 1, బళ్లారి 1, వేలూరు మొత్తం 4 బస్సులున్నాయి.

జిల్లా కేంద్రంలో ప్రయాణికులకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

జిల్లా కేంద్రంలో ప్రయాణికులు సదుపాయాలు కోసం తాగు నీరు, కూర్చోవడం కోసం నూతన కుర్చీలు, ఫ్యాన్లు, టీవీలు, బాత్రూంలు, క్యాంటీన్, ద్విచక్ర వాహనాలకు పార్కింగ్, రిజర్వేషన్ కౌంటర్ కార్గో వంటి సదుపాయాలను ఏర్పాటు చేశాం.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడు కల్పిస్తున్నారు?

మహిళలకు ఆర్‌టిసి బస్సులో ఉచిత ప్రయాణం ఆగస్టు 15 నుంచి అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. త్వరలో ప్రారంభించడా నికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. మాకు ఇంకా నివేదికలు రాలేదు.

ఆదాయం కోసం ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఆర్‌టిసి స్థలాలను లీజుకి ఇవ్వడం, బస్ స్టేషన్‌లలో ఖాళీగా ఉన్న స్టాళ్లకు టెండర్లు పిలవడం, తక్కువ ఆదాయం వచ్చు సర్వీసులను క్రమబద్ధీకరించుట లేదా కార్గో ఆదాయం పెంచుకునుట ద్వారా ఆదాయం పెంచుకుంటాం. పోలీస్, ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంటు వారితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అక్రమ రవాణాను అరికట్టి ఆర్‌టిసి ఆదాచాన్ని పెంచుకునేందుకు చర్యలు ఈసుకుంటున్నాం.

డ్రైవర్లకు శిక్షణ తరగతులు ఏమైనా నిర్వహిస్తున్నారా?

సాధారణంగా ప్రతి వారమూ శిక్షణ తరగతులు నిర్వహిస్తాం. జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలలో కూడా క్రమం తప్పకుండా డ్రైవర్‌కు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం.

కండక్టర్లు, డ్రైవర్ల వివరాలు తెలపండి? సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

833 మంది జిల్లావ్యాప్తంగా 833 మంది కండక్టర్లు, 808 మందిని డ్రైవర్లు ఉన్నారు. జిల్లాలో ఎటువంటి సిబ్బంది కొరత లేదు.

ప్రయాణికులకు సలహాలు, సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

ఆర్‌టిసిలో ప్రయాణం సురక్షితం, సుఖమయం, శుభప్రదం కావునా ప్రయాణికులు అందరూ ఆర్‌టిసి బస్సులలో ప్రయాణించి ఆర్‌టిసిని ఆదరించి సంస్థను బలోపతం చేయాలి. ఆర్‌టిసి బస్సులో ప్రయాణం చేయడం వల్ల వారి వారి గమ్యానికి జాగ్రత్తగా చేరుకోవచ్చు.

మహా మేళాను జయప్రదం చేయండి

ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు రామాంజనేయులు

ప్రజాశక్తి- రాయచోటి

ఒంగోలులో జులై 7న నిర్వహించే ఎంఅర్‌పి స్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించే మాదిగల మహామేళా కార్యక్రమానికి జిల్లాలోని మాదిగలు వేలాదిగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు ఎస్.రామాంజినేయులు పిలుపు నిచ్చారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ పెక్సి వద్ద పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ఈదుముడిలో 1994లో పురుడు పోసుకున్న ఎంఅర్‌పిఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాటాసమితి)ఉద్యమం 31వ ఆవిర్భావ దినోచ్చావాన్ని పురస్కరించుకొని ఒంగోలులో మాదిగలమహా మేళాను నిర్వహిస్తరన్నారు. ఏడు దశాబ్దాలనాటి కల లక్ష్యం వర్గీకరణ అన్నారు.1999 లోను 2024లోను వర్గీకరణ చేసిన ఘనత చంద్రబాబు నాయుడు దేనన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒకసారి వర్గీకరణ సాధించుకుని ఫలితాల అనుభవిస్తున్న సమయంలో కొన్ని సాంకేతిక కారణాలవల్ల వర్గీకరణ రద్దు చేయడం దారుణమన్నారు తిరిగి రెండవ ఉద్యమానికి నాంది పలికి మాదిగ బిడ్డల ప్రాణత్యాగాల వల్ల ఎస్‌సి వ ర్గీకరణ సాధించుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు బండపల్లి బసయ్య, వెంకట రమణ, రెడ్డయ్య, మహేష్ జ్యోతిష్, కార్తీక్, రాఖీ, సాయి, రెడ్డి నరసింహ, కౌసిక్, సంజీవ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : ఎంఆర్‌ఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి కోట డానియల్ పేర్కొన్నారు. ఆదివారం ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ 30 ఏళ్ల సామాజిక ఉద్యమాన్ని ప్రజలకు తెలిసేలా వాడవాడలా జూలై 7న జెండా ఎగరవేయాలని సూచించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ సూచనలు ప్రతి ఒక్కరూ పాటించాలని అన్నారు. ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి, విహెచ్‌పిఎస్ ఇందులో భాగస్వామ్యులై ఉద్యమానికి సహకరించిన వారిని ఘనంగా సత్కరించాలని సూచించారు. కార్యక్రమంలో వెలగచర్ల శివయ్య, మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకులు మదనపల్లె పెంచలయ్య వడ్డెర, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు సుబ్బయ్య, సంతోష్, సన్నీ, శివ పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ జెనీఫర్

ప్రాథమిక వైద్యంపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-పీలేరు

ప్రాథమిక వైద్యం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎస్.కె.అలీమ్, డాక్టర్ డి.జెనిఫర్ తెలిపారు. 'మేము సైతం సమాజం కోసం' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఎజె వైద్యశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, 129 మందికి వైద్యంతో పాటు ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా ఈ మెడికల్ క్యాంప్ నిర్వహించడం ఎంతో సంతృప్తినిచ్చిందని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక వైద్యం అందించాలన్న ఉద్దేశంతోనే ఈ క్యాంప్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మేము సైతం సమాజం కోసం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు షేక్ షాహిన్నా మాట్లాడుతూ సమాజ సేవ తమ లక్ష్యమని, ఇలాంటి కార్యక్రమాలు క్రమంగా నిర్వహిస్తూ ప్రజల్లో ఆరోగ్యం పట్ల అవగాహన పెంచడం తమ బాధ్యతని అన్నారు. కార్యక్రమంలో మేము సైతం సమాజం కోసం స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి బుజ్జి, సంయుక్త కార్యదర్శి కలకడ బాబు, ట్రెజరర్ షాజహాన్, కార్యనిర్వాహక కార్యదర్శి రిజ్వాన్, ప్రోగ్రాం ఇన్చార్జ్ ఆదిల్, జిల్లా ఇన్చార్జ్ పటాన్ సయ్యద్, ఆఫీస్ ఇన్చార్జ్ జావిద్, వాలంటరీ ఇన్‌ఛార్జి సుహెల్, కన్వీనర్ షమా, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మానవత్వం చాటుకున్న కడప ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తులను ఆసుపత్రికి తరలించి కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని స్థానిక జెఎన్‌టియు కాలేజీ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. తొండూరు మండలం కృష్ణంగారి పల్లె నుంచి పాల ఆటో పులివెందులకు వస్తుండగా జెఎన్‌టియు సమీపంలోకి రాగానే అక్కడ చెత్త కాగితాలు ఏరుకునే గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా అతన్నిఆటో ఢీ కొట్టి పల్టీ కొట్టింది. కాగితాలు ఏరుకునే గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా ఆటోలో ప్రయాణిస్తున్న కృష్ణంగారిపల్లెకు చెందిన షబానా, శంషాద్ స్వల్పంగా గాయపడ్డారు. అదే ఆటోలో ప్రయాణిస్తున్న కృష్ణంగారిపల్లెకు చెందిన హనుమంత్‌రెడ్డికి నడుము భాగంలో గాయమై లేవలేని పరిస్థితిలో పడి ఉండగా.. ఆ సమయంలో అటువైపు పులివెందులకు వస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తన కాన్వాయ్‌ని ఆపి దిగి గాయపడిన హనుమంత్ రెడ్డిని పరామర్శించారు. అక్కడికి 108 వాహనం చేరుకోకపోవడంతో తన సెక్యూరిటీ వాహనం ద్వారా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వేమన పద్యం ప్రాంతాలు, భాషలకు అతీతమైంది

ప్రజాశక్తి కడప అర్బన్

వేమన నిజమైన ప్రజాకవి అని, అందువల్లనే ఆయన పద్యం కులాలను, మతాలను, ప్రాంతాలను, భాషలను దాటి విస్తరించిందని తెలుగు భాషా సేవకులు రమేష్ (శ్రీకాళహస్తి) అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 144వ సదస్సు నిర్వహించారు. 'సజీవ సంప్రదాయంగా వేమన' అనే అంశంపై తెలుగు భాషా సేవకులు స.వెం.రమేష్ ప్రసంగించారు. వేమన పద్యం ఏ భాషకూ లేనంత గొప్పతనాన్ని తెలుగు భాషకు కలిగించిందన్నారు. తమిళకవి తిరువళ్ళ వర్‌తోనూ, కన్నడకవి సర్వజ్ఞునితోనూ వేమనను పోలుస్తుంటారని, సమాజంలో మంచిని పెంచి, చెడును తుంచే విషయంలో ఆ ముగ్గురికీ పోలిక ఉన్నమాట వాస్తవమే అయినప్పటికీ వీళ్ళకన్నా వేమనే గొప్పవాడని అన్నారు. తిరువళ్ళువర్‌ను తమిళ ప్రభుత్వాలు పట్టించుకుని ప్రచారం చేయడంవల్ల ఆయన రాసిన కురుళ్లు కొంత వాడుకలోకి వచ్చినప్పటికీ, చదువుకున్న తమిళ ప్రజల నాలుకలపైన మాత్రమే ఆయన నానుతున్నాడన్నారు. అదేవిధంగా సర్వజ్ఞుడు కర్ణాటకలో కొంత సామాన్య జనంలోకి పోయినప్పటికీ ఆయన పరిధి కూడా చాలా పరిమితమని, వేమన అలా కాక కులాలను, మతాలను, ప్రాంతాలను, భాషలను దాటి దూసుకు పోయాడన్నారు. వేమన వేసిన అడుగు చాలా పెద్దదని, నిచ్చెనమెట్ల కుల సమాజంలో అట్టడుగున ఉన్న ఆశ్రిత కులాల గుండెల్లో కూడా గూడు కట్టుకోవడం ఆయన ప్రత్యేకత అన్నారు. కార్యక్రమాన్ని డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి సమన్వయం చేశారు. ప్రారంభంలో వక్త స.వెం.రమేశ్‌ను యోగి వేమన విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు జి.శివారెడ్డి, పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, గ్రంథాలయ సహాయకులు ఎన్ .రమేశ్‌రావు, జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది, పాఠకులు కలిసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఎన్.విజయా నందరెడ్డి, డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి, డాక్టర్ ఎస్.రాజగోపాలరెడ్డి, భూపతి రాయల్, రమేశ్, కొత్తపల్లె రామాంజనేయులు, సాయిబాబా, తేజ, మహేష్, దక్షిణామూర్తి, విజయకుమార్, శాంతారామ్, శ్యామసుందర్ రెడ్డి, రామమోహన్ రెడ్డి, పల్లె విజయ్, శ్రీనివాసులు, సాయికుమార్ పాల్గొన్నారు.



రమేష్‌ను సన్మానిస్తున్న అతిథులు



వైసిపి నాయకులను పరామర్శిస్తున్న గడికోట శ్రీకాంత్ రెడ్డి

వైసిపి నాయకులకు 'గడికోట' పరామర్శ

ప్రజాశక్తి-రామాపురం

రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్న వైసిపి నాయకులను అనారోగ్యంతో బాధపడుతున్న నాయకులను వైసిపి ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి వారి ఇళ్ల వద్దకు వెళ్లి పరామర్శించారు. మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ బి.రాచపల్లెకు చెందిన మోపూరు భక్తవత్సలరెడ్డి ప్రమాదంలో గాయపడి శస్త్రచికిత్స చేయించుకొని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న వేణుగోపాల్ రెడ్డి కంటి ఆపరేషన్ చేయించుకొన్న పెద్ద రెడ్డయ్య రెడ్డిని, రాచపల్లి పంచాయతీ రాచపల్లి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ వెంకటరమణారాజు ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకొని ఇంటి వద్ద వెళ్లి పరామర్శించారు. అదే పంచాయతీని ఎగువ కొత్తూరువాండ్లపల్లె చెందిన కొప్పూరు సుబ్బారెడ్డిని కలిసి ధైర్యం చెప్పారు. అందరి ఆరోగ్యాలు మెరుగుపడి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం రాచపల్లి పంచాయతీలోని నాయనవారిపల్లి గ్రామానికి చెంది న వైసిపి నాయకుడు అమ్మతనాయుడు తండ్రి వెంకట మల్లప్ప నాయుడు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని గ్రామ నాయకులతో కలిసి మల్లప్ప నాయని మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. గడికోట వెంట నల్లగుట్టపల్లి, రాచపల్లి గ్రామ పంచాయతీల సర్పంచులు అయోధ్యపురం నాగభూషణ్ రెడ్డి, వెంకట రెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షులు అయోధ్యపురం పెద్దిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, రాచపల్లి ఎంపిటిసి ద్వారకానాథ్‌రెడ్డి, వైసిపి నాయకులు యోగేశ్వర రెడ్డి, భాస్కర్‌రెడ్డి చిన్న వెంకటరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు తవళంలో పౌర హక్కుల పరిరక్షణ సమావేశం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని తవళంలో సోమవారం పౌర హక్కుల పరిరక్షణ దినోత్సవ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ తపస్విని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినెల 30న క్రమ పద్ధతిలో మండలంలోని ఒక గ్రామంలో పౌర హక్కుల పరిరక్షణ దినోత్సవ సమావేశాన్ని నిర్వహిస్తూ, ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తున్నట్లు వస్తున్నామని అన్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు తవళంలో సివిల్ రైట్స్‌డే సమావేశం ప్రారంభమవుతుందని, అన్ని శాఖల మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, సంబంధించిన దళిత సంఘాల నాయకులు సమావేశానికి తప్పక హాజరు కావాలని తెలిపారు.

ఇంటి వద్దకే రేషన్ పంపిణీ

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వృద్ధులకు, వికలాంగులు ప్రతిభావంతులకు ఇంటి వద్దకే నిత్యవసరాలు రేషన్ డీలర్లు ప్రభుత్వ ఆదేశాల మేరకు జూలై నెలకు సంబంధించి ముందుగానే పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే రేషన్ డీలర్లు బియ్యం తెచ్చి ఇస్తుండడంతో వృద్ధులు దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేశారు.



సమీక్షలో జగన్‌మోహన్‌రాజు

టిడిపి సమీక్షకు హాజరైన 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో "సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన సమావేశానికి రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు హాజరయ్యారు. జూలై 2 నుంచి ప్రతి ఇంటికి, ప్రజలకు దగ్గరయ్యే విధంగా కూటమి ప్రభుత్వంలో ఏడాదిలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు మరియు సంక్షేమ పథకాల గురించి, ప్రభుత్వం అమలు చేస్తున్న మెగా డిఎస్‌సి, పింఛన్లు, ఇంధ్ర, గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఆగస్టు 15వ తేదీన మహిళలకు ఆర్‌టిసి బస్సులో ఉచిత ప్రయాణం వంటి ఇంకా అనేక పథకాలను వివరిస్తూ ప్రజల్లోకి వెళ్లాలని సూచనల మేరకు మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు టిడిపి ముఖ్య నేతలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులకు దిశ నిర్దేశం చేయడం జరిగిందని చమర్తి తెలిపారు.

అడ్మిషన్ల కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - వేంపల్లె

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీ 2025-26 విద్యా సంవత్సర ప్రవేశానికి సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి రోజు సోమవారం ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లోని సెంట్రల్ లైబ్రరీలో 530 మంది విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. అందుకు సంబంధించి కొత్తగా వచ్చిన విద్యార్థులకు భోజనం, మౌలిక వసతులు తదితర ఏర్పాట్లు చేశారు. ముందుగా ట్రిపుల్‌ఐటి ముఖద్వారం వద్ద విద్యార్థులు టోకెన్ తీసుకొని సెంట్రల్ లైబ్రరీలో దరఖాస్తు పూర్తి చేసుకొని సర్టిఫికెట్లు వెరిఫికేషన్ ఉంటుంది. అనంతరం పదవ తరగతిలో పాసైన ఒరిజినల్ సర్టిఫికెట్లు, టీసీ, విద్యార్థి ఫోటోలు, తల్లిదండ్రుల ఫోటోలు తదితర వాటిని పొందుపరిచి అడ్మిషన్ పూర్తి చేస్తారు. జూలై 1న 530 మంది విద్యార్థులకు అడ్మిషన్లకు సంబంధించి కౌన్సిలింగ్ నిర్వహిస్తారు. జూలై 15 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

ఉద్యోగ విరమణ జీవితంలో ఒక భాగమే

- ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

ఉద్యోగ విరమణ జీవితంలో ఒక భాగమేనని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గుట్టపాలెం పంచాయతీ వాడవాండ్లపల్లికి చెందిన ఉపాధ్యాయుడు బరినపల్లి వెంకట నారాయణ వాల్మీకిపురం మండలం, గండబోయినపల్లి పంచాయతీ టిజెఆర్ పల్లిలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా వాడవాండ్లపల్లిలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగం చేసే ప్రతి వారికి ఉద్యోగ విరమణ ఉద్యోగంలో భాగమేనని, 30 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో పనిచేస్తూ ఎంతోమంది పిల్లల భవిష్యత్తును ఉన్నత స్థానాలకు చేర్చిన ఉపాధ్యాయు వృత్తిని నిర్వర్తించడం గొప్ప అదృష్టమని అలాంటి వృత్తిని విడిచిపెట్టడం బాధాకరమైన తప్పదని అన్నారు. ఉపాధ్యాయుడు వెంకటనారాయణ మాట్లాడుతూ గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిని చేపట్టడం తమ అదృష్టంగా భావించి ఎంతో మంది పిల్లలకు నిస్వార్థంగా సేవ చేయడం ఆనందంగా ఉందని అన్నారు. ఉద్యోగ విరమణ చేయడం ఒక ప్రక్క భాదగా వున్నా యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలంటే మాలాంటి వాళ్ళు ఉద్యోగవిరమణ చేయక తప్పదని అన్నారు. తనకు శుభాకాంక్షలు తెలిపినబంధువులు, తోటి ఉద్యోగులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞత అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నల్లారి లక్ష్మీకర్, రెడ్డి నల్లారి చంద్రారెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, మాజీ ఎంపిటిసి జనార్ధన్ గౌడ్, యతేంద్రయాదవ్, ఎర్రంరెడ్డి, దినకర్, శ్రీనివాస్‌వర్మ, సహచర ఉపాధ్యాయులు, బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులు వెంకటనారాయణను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

డిగ్రీ ఫలితాల్లో సత్తా చాటిన 'శ్రీసాయి' విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ పెంచలయ్య

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

డిగ్రీ ఫలితాల్లో శ్రీ సాయి డిగ్రీ కళాశాల విద్యార్థులు జిల్లాలో అత్యధిక మార్కులు సాధించి టౌన్ ఫస్ట్, యూనివర్సిటీ ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4వ బిఎస్‌సి, బొటని హానర్స్‌లో ఎస్.సల్మా 9.85 జిపిఎ, 4వ బిఎస్‌సి కంప్యూటర్స్ హానర్స్‌లో ఎన్.రాజేశ్వరి 9.70 జిపిఎ, 4వ సెమిస్టర్ బీకాం కంప్యూటర్స్ హానర్స్‌లో సి.వైష్ణవి 9.50 జిపిఎ సాధించారని అన్నారు. 2వ సెమిస్టర్ బికాం కంప్యూటర్స్ హానర్స్‌లో కె.మన్మధ 9.75జిపిఎ, ఎస్.ఎ.సాజియా, పి.జస్వంత్ 9.50శాతం, 2వ సెమిస్టర్స్ బిఎస్‌సి కంప్యూటర్స్ హానర్స్‌లో బి.వర్షిణి, కె.అక్షయ, ఎస్. అయేషా 9.75 జిపిఎ మార్కులు సాధించినట్లు చెప్పారు. 2వ సెమిస్టర్స్ బిఎస్‌సి బోటనీ హానర్స్‌లో ఎస్.జాస్మిన్ 9.50 సాధించారని, 9.0 జిపిఎపైన మార్కులు 58 మంది సాధించారని తెలిపారు. ఈ ఘన విజయానికి కారణమైన విద్యార్థులు, అధ్యాపకులను కళాశాల డైరెక్టర్లు పి.శ్రీనివాసులు, ఎస్.ఎన్ శ్రీనివాసులు, కె.చంగలరాజు, యు.అనిత శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల స్థాపన దశ నుంచి అద్భుతమైన ఫలితాలు సాధించడం గర్వకారణం, ఇది భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలు అందించగలదని అన్నారు.

రసాభాసగా మారిన టిడిపి వార్డు కమిటీ ఎన్నికలు

- వాయిదా వేసిన పరిశీలకులు సీతప్ప
- మరోసారి బట్టబయలైన విభేదాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

టిడిపి వార్డు కమిటీ ఎన్నికలు రసాభాసగా మారాయి. ఆదివారం పట్టణంలోని బెంగళూరు రోడ్డులో ఉన్న జామి షాది మహల్‌లో ఆదివారం ఉదయం 11:30 గంటల నుంచి 12:30 వరకు బి.కొత్తకోట టౌన్ వార్డుల కమిటీ ఎన్నికలు పట్టణ టిడిపి పరిశీలకులుగా వచ్చిన కె.సీతప్ప ఆధ్వర్యంలో మొదలయ్యాయి. ఈ కార్యక్రమానికి స్థానిక టిడిపి కార్యకర్తలు సుమారు 150 మంది హాజరయ్యారు. పట్టణంలోని 20 వార్డులకుగాను 12 వార్డుల కమిటీలను పరిశీలకుడు ఎవరెవరు పోటీ చేస్తున్నారు, మొదలైన వివరాలు వారికున్న మద్దతు వివరాలను నమోదు చేసుకున్నారు. కేవలం బి.కొత్తకోట పట్టణానికి సంబంధించి కమిటీ ఎన్నికలు జరుగుతుంటే పిటిఎం మండలం, రాపూరివాండ్లపల్లికి చెందిన పి.ప్రతాపరెడ్డి షాది మహల్ వద్దకు వచ్చి, ఇక్కడ తాము చెప్పినట్లే జరగాలని, తాము ఎన్నుకున్న వారిని కమిటీ ఆమోదించాలని హుకుం జారీ చేశారు. అందుకు సీతప్ప ఒప్పుకోకపోవడం, పట్టణ కార్యకర్తలు వ్యతిరేకించడంతో కమిటీల ఎన్నికలు వాయిదా పడ్డాయి. టిడిపి సీనియర్ నాయకులు కమిటీలు నిర్వహిస్తుంటే వాయిదా వేయాలని ఉద్దేశంతోనే పక్క మండలాల వాళ్లు వచ్చి జరగకుండా చేశారని కొందరు ఆరోపించారు. ఇది ఒకానొక సమయంలో ఇరు గ్రూపుల మధ్య ఘర్షణకు దారి తీసింది. సీనియర్ నాయకులు తీవ్ర ఘర్షణకు దారితీకుండా టిడిపి సీనియర్ నాయకులు బంగారు వెంకటరమణ, కుడుము శ్రీనివాసులు, నారాయణస్వామిరెడ్డి పరిస్థితిని అదుపు చేశారు. అనంతరం ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి గ్రూపుకు చెందిన వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. సీనియర్ నాయకులు, కార్యక్రమానికి విచ్చేసిన వారికి, టిడిపి కార్యకర్తలకు కుడుము శ్రీనివాసులు భోజన వసతి కల్పించారు. ఇప్పటికైనా నియోజకవర్గంలో జరుగుతున్న విషయాన్ని రాష్ట్ర అధినాయకత్వం ప్రత్యేక దృష్టి సారించి, తంబళ్లపల్లి సీనియర్ నాయకులు, కేడర్‌ను కాపాడుకోవాలని పలువురు టిడిపి నాయకులు కోరుకుంటున్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు హుస్సేన్, కుడుము శరత్, బావగారిపల్లి మనోహర్ నాయుడు, కరెంటు మురళి,గోవింద్, ఆలేటిపల్లి శ్రీనాథ్, సోము, వెంకట్ పాల్గొన్నారు.



వార్డు కమిటీ ఎన్నికల్లో ఘర్షణ పాల్పడుతున్న టిడిపి నాయకులు

ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన



గుండె వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, బాస్ నేతలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నారాయణ హృదయాలయ వైద్యులతో కలిసి, భారతీయ అంబేద్కర్ సేన (బాస్) నిర్వహించిన 20వ ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. మదనపల్లె టౌన్ అమ్మచెరువు మిట్ట మునిసిపల్ హైస్కూల్‌లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వైద్య శిభిరం జరిగింది. బాస్ వ్యవస్థాపకుడు పిటిఎం శివప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన ఈ వైద్య శిభిరంలో నారాయణ హృదయాలయ కోలార్ బ్రాంచ్ కు చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఎస్. కిరణ్ కుమార్, గుండె పరీక్షల టెక్నిషన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 176 మందికి బీపి, షుగర్, ఇసిసి, ఎకో తదితర గుండె పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో 11 మందికి గుండె జబ్బులు ఉన్నట్లు నిర్ధారణ కావడంతో వారిని శస్త్ర చికిత్సలకు రెఫర్ చేశారు. వీరికి కోలార్ లోని నారాయణ హార్ట్ సెంటర్ నందు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం క్రింద ఉచితంగా చికిత్సలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్య శిబిరం ముగింపు సందర్భంగా గుండె వైద్యులు, టెక్నిషన్లను బాస్ శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రాణాంతకమైన గుండె జబ్బుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రతీ ఒక్కరూ కనీసం ఏడాదికి ఒక్కసారైనా గుండెకు సంబందించిన పరీక్షలు చేయించుకొని, గుండె పనితీరును తెలుసుకోవాలని సూచించారు. అననంతరం బాస్ వ్యవస్థాపకుడు శివప్రసాద్ మాట్లాడుతూ బాస్ సంస్థ నారాయణ హృదయాలయ వారితో కలిసి ఇప్పటి వరకూ 20 ఉచిత గుండె వైద్య శిభిరాలను నిర్వహించిందని, ఈవైద్య శిభిరాలన్నింటికీ విశేష స్పందన లభించిందన్నారు. ఇప్పటి వరకూ బాస్ సంస్థ నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిభిరాలలో 5,309 మందికి నారాయణ హృదయాలయ వైద్యులు స్క్రీనింగ్ చేయడం జరిగిందని, ఇందులో 591 మందికి గుండె సంబంధిత జబ్బులు ఉన్నట్లు నిర్ధారణ కాగా, వీరిలో 537 మందికి కోలార్ లోని నారాయణ హార్ట్ సెంటర్ నందు ఆరోగ్యశ్రీ పథకం క్రింద ఉచితంగా చికిత్సలు అందించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సమాఖ్య వ్యవస్థాపకుడు కోనేటి దివాకర్, భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల మోహన్, రాష్ట్ర కోశాధికారి నీరుగట్టి రమణ, రాష్ట్ర కార్యదర్శి టి.ఎ. పీర్ బాషా నారాయణ హార్ట్ సెంటర్ వైద్య శిభిరాల మేనేజర్ నరేష్, టెక్నిషన్లు మనోజ్, దానియా, రెడ్డికుమారి పాల్గొన్నారు.

ముగ్గురు అంతర్ జిల్లా దొంగలు అరెస్టు

ప్రజాశక్తి- నందలూరు

మండలంలోని నందలూరు గ్రామ పంచాయతీ దుర్గాపురం క్రాస్ రోడ్డు వద్ద ముగ్గురు అంతర్‌జిల్లా దొంగలను పట్టుకుని వారి వద్ద నుంచి రూ.25లక్షలు విలువ చేసే 250 గ్రాములు బంగారు ఆభరణాలు, రూ.14వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట రూరల్ సిఐ బి.వి రమణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, రాజంపేట ఎఎస్‌పి మనోజ్ రామ్నాథ్ హెగ్డే సూచనల మేరకు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కి రాబడిన నమ్మకమైన సమాచారం మేరకు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో దుర్గాపురం క్రాస్ రోడ్డు వద్ద పోలీసులను చూసి ఆవుల సంజయ్య, ఆవుల ఈశ్వరమ్మ, ఆవుల ప్రమీల అను వారు బ్యాగులను పట్టుకుని ఉండి తమను చూసి పారిపోవుటకు ప్రయత్నించగా వారిని వెంబడించి పట్టుకొని వారి వద్ద నుండి 250 గ్రాముల బంగారు నగలు, రూ.14వేలు నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందని అన్నారు. నిందితులు బ్యాగు దొంగతనాలు చేసే అంతర్ జిల్లాల దొంగల ముఠా అని తెలిపారు. శ్రీ సత్య సాయి జిల్లాకు చెందిన నంబుల పూల కుంట గ్రామానికి చెందినవారు వీరి పైన నంద లూరులో రెండు కేసులు, వేంపల్లి, పులివెందుల, అనంతపురం మూడవ టౌను, ఆళ్లగడ్డ టౌన్, నంద్యాల వన్ టౌన్ లలో దొంగతనాలు చేశారని తెలిపారు. నిందితులపై నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. అంతర్ జిల్లాల దొంగలను చాతచక్యంగా పట్టుకొని ప్రతిభ కనబరిచిన ఎస్ఐ మల్లికారున్‌రెడ్డి, సిబ్బందిని ఎస్‌పి అభినందించినట్లు తెలిపారు. వీరి పేర్లను రివార్డ్ నిమిత్తం ఎస్‌పికి సిఫారసు చేసినట్లు తెలిపారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సిఐ



అవార్డు అందుకుంటున్న సుధాకర్

రేపన సుధాకర్‌కు మదర్‌థెరిసా అవార్డు

ప్రజాశక్తి-సుండుపల్లి

న్యూఢిల్లీలో ప్రముఖ ఫేస్ గ్రూప్ సంస్థ వారు నిర్వహించిన జాతీయ సదస్సులో మండలంలోని మాధురి హై స్కూల్ కస్పాండెంట్ డాక్టర్ రేపనా సుధాకర్‌కు మదర్‌థెరిసా అవార్డు ప్రదానం చేసింది.కేంద్ర మంత్రి మజీందర్ సింగ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాలలో విద్యాభ్యాసాలు విద్యార్థులకు విద్యను అందించే సేవలను గుర్తించి తనకు ఈ అవా ర్డును అందించారని తెలిపారు. కార్యక్రమంలో బాలీవుడ్ సంబంధించిన అనేకమంది సంగీత కళాకారులు, కార్యక్రమంలో డాక్టర్ మొహమ్మద్‌రఫీ, ప్రముఖులు పాల్గొన్నారని పేర్కొన్నారు.

క్రైం కార్నర్



హిందూజా తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ, డిఎస్‌పి

పీలేరులో వివాహిత అనుమానాస్పద మృతి

- భర్తే హత్య చేశాడంటూ మృతురాలి తల్లిదండ్రుల ఆరోపణ
- రాయచోటి ఆర్‌డిఒ, డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి-పీలేరు



హిందూజ (ఫైల్ పోటో)

పీలేరులో ఓ వివాహిత మృతి అనుమానాస్పదంగా మారింది. ఆదివారం మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ బందార్లపల్లెలో ఆదివారం చోటు చేసుకున్న సంఘటన వివరాలు పీలేరు పోలీసులు, మృతురాలి బంధువుల కథనం మేరకు ఇలా ఉన్నాయి. బందార్లపల్లెకు చెందిన శంకర్ రెడ్డి కుమారుడు విజయశేఖరరెడ్డికి బెంగళూరులో స్థిరపడిన చిత్తూరు జిల్లా తవణంపల్లెకు చెందిన జీవనజ్యోతి, లోకనాథరెడ్డి దంపతుల కుమార్తె హిందూజ(29) లకు సుమారు ఏడేళ్ల ముందు వివాహమైంది. ఆ దంపతులక చార్విష్ రెడ్డి, రుషిక అనే ఇద్దరు పిల్లలున్నారు. విజయశేఖరరెడ్డి ఆమె బంధువులకు ఫోన్ చేసి ఆదివారం ఉదయం 3 గంటల ప్రాంతంలో హిందూజ మృతి చెందిందన్న సమాచారం అందించాడు. మృతురాలి విషయంలో ఆమె భర్త బంధువులు కొందరికి ఫోన్ చేసి ఇంట్లో నిద్రపోతూ గుండెపోటుతో చనిపోయిందని, మరికొందరికి తమ ఇంటి సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుందని, ఇంకొందరికి తమ గ్రామ సమీపంలోని చెరువులో దూకేసిందని చెప్పడంతో వారంతా హుటాహుటిన ఆదివారం ఉదయానికి బందార్లపల్లెకు చేరుకున్నారు. విజయ్ శేఖర్ రెడ్డి ఒక్కొక్కరికి ఒక్కోరకమైన కథనాలు వినిపించడంతో బంధువుల్లో అనుమానాలు నెలకొన్నాయి. విజయశేఖర రెడ్డికి ఉన్న వివాహేతర సంబంధం కారణంగా గతంలోనూ భార్యభర్తల మధ్య పలుమార్లు గొడవలు, పంచాయతీలు జరిగి ఉండడంతో వచ్చిన బంధువులు హిందూజా మరణంపై తమకు అన మానాలు ఉన్నాయని, పీలేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ లోకేష్ తన సిబ్బందితో బందార్లపల్లెకు చేరుకుని విజయశేఖర్ రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. హిందూజా మృతదేహాన్ని పోస్టుమారం నిమిత్తం పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బంధువుల మధ్య అభిప్రాయబేధాలు తలెత్తడంతో తమకు అన్యాయం జరుగుతోందంటూ వారు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో, కలెక్టర్ ఆదేశాల మేరకు రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, డిఎస్‌పి కృష్ణమోహన్ పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని విచారణ చేపట్టారు. హిందూజా తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని, హిందూజా మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి ఆ తర్వాత అందే నివేదిక ఆధారంగా దర్యాప్తు చేపడతామని వారు స్పష్టం చేశారు. తమ కుమార్తె హిందూజాను అల్లుడు విజయశేఖరరెడ్డే హత్య చేశాడని, పలమనేరుకు చెందిన ఓ మహిళతో ఉన్న వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందన్న నెపంతోన9 అతను ఈ పని చేసి ఉంటాడని హిందూజా తల్లిదండ్రులు జీవనజ్యోతి, లోకనాథరెడ్డి ఆర్‌డిఒ శ్రీనివాస్, డిఎస్‌పి కృష్ణమోహన్ కు ఫిర్యాదు చేశారు.

గంజాయి మత్తులో యువకుల వీరంగం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని స్థానిక రంగసముద్రం రోడ్డులో పట్టపగలు వీరంగం సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ప్రధాన రహదారిపై ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం వచ్చేపోయే వారిని ఇబ్బందులకు గురి చేస్తూ వాహన రాకపోకలకు యువకులు ఆటంకం కలిగిస్తున్నారు. వీరంగం సృష్టించిన వారు బీహార్ నుంచి వలస వచ్చిన కార్మికులని స్థానికులు తెలిపారు. సుమారు 45 నిమిషాల పాటు వీరంగం సృష్టించి ప్రజలకు ఇబ్బంది కలిగించారని అన్నారు. ఇటీవల యువకుల గొడవలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఉన్నాయని వీరిని అరికట్టకపోతే మరిన్ని ఇటువంటి ఘటనలు చూడాల్సి వస్తుందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైన్‌షాపులో నగదు చోరీ

ప్రజాశక్తి-కలికిరి

మండల కేంద్రం కలికిరిలోని ఓ వైన్ షాపులో నగదు చోరీ అయినట్లు వైన్ షాపుల ఇన్‌ఛార్జి దేవేందర్ రెడ్డి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దేవేందర్ రెడ్డి కథనం మేరకు కలికిరి క్రాస్ రోడ్ కలకడ రోడ్డులో ఉన్న వైన్‌షాప్‌లో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వెనుక వైపు ఉన్న కిటికీ దగ్గరలో గడ్డపారతో బొక్క పెట్టి అందులో నుంచి ఓ వ్యక్తి లోపలికి వెళ్లి క్యాష్ టేబుల్ లోని డ్రాలో ఉన్న రూ.3.90లక్షలు నగదును చోరీ చేసి తీసుకెళ్లారని, డ్రా తీసి డబ్బులు తీసుకున్న దృశ్యం సిసి కెమెరాలు కూడా రికార్డ్ అయినట్లు ఆయన పోలీసులకు వివరించారు. విషయం తెలుసుకున్న సిఐ రెడ్డి శేఖర్‌రెడ్డి వైన్‌షాప్ దగ్గర చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలి శనివారం సాయంత్రం క్యాష్ కౌంటర్ దగ్గర పనిచేస్తున్న క్యాషియర్ రవీంద్రనాయక్, రెడ్డిశేఖర్‌లను పిలిచి ఎలా జరిగిందో వివరణ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వాహనం ఢీకొని హోంగార్డుకు గాయాలు

ప్రజాశక్తి-కలికిరి

ద్విచక్ర వాహనం ఢీకొని హోంగార్డు ప్రతాప్ రెడ్డికి తీవ్ర గాయాలైనట్లు సిఐ రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు..ఆదివారం ఉదయం పది గంటలకు రోజువారి తనిఖీల్లో భాగంగా వాహనాలను తనిఖీ చేస్తుండగా కలిగిరి పట్టణానికి చెందిన ఖాదర్ హుస్సేన్ కుమారుడు మహమ్మద్ ఫజరుద్దీన్ యూనికాన్ మోటార్ సైకిల్ పైన ఆర్‌టిసి బస్టాండ్ నుంచి క్రాస్ రోడ్డు వైపు అతివేగంగా వెళ్లుచు విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డును ఢీకొట్టినట్లు తెలిపారు. హోంగార్డుకు కాలుకు తీవ్ర గాయమై రోడ్డు పైన పడిపోవడంతో అతన్ని హుటాహుటిన కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి చేర్పించి ప్రథమ చికిత్స చేయించారు. తర్వాత మెరుగైన చికిత్స వరకు తిరుపతి రుయాకు తరలించినట్లు సిఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఫజురుద్దీన్ పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.